ప్రజాశక్తి
గురువారం 07 మార్చి 2024
5
కర్నూలు

చెక్కును అందజేస్తున్న కలెక్టర్, మేయర్, అధికారులు నాయకులు

ప్రజా గొంతుక సోమన్న

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా పని చేసిన సోమన్న ప్రజా గొంతుక అని ఆ నాయకునికి జోహార్లు అర్పిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం సోమన్న రెండవ వర్ధంతి సందర్భంగా కార్మిక కర్షక భవన్‌లో కర్నూలు మండలం సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి హుస్సేనయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. సోమన్న ఎంతో నిజాయితీగా పట్టుదలతో ఉక్కు క్రమశిక్షణతో పార్టీలో పని చేస్తూ ప్రజలకు సేవ చేశారన్నారు. పార్టీ ఏ పని అప్పజెప్పిన ఆ పనిని ఎంతో శ్రద్ధతో నిర్వర్తించేవారున్నారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా ఎక్కడ పని చేయమన్నా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఎలాంటి సమస్యలు వెంటాడినా అక్కడ పనిచేసే వారన్నారు. అలాంటి సోమన్న భౌతికంగా దూరం కావడం వారి కుటుంబానికి, పార్టీకి ఎంతో నష్టమని అన్నారు. సోమన్న భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు మన ముందు ఉంచారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేడు మతం పేరుతో రాజకీయం చేస్తున్న బిజెపికి వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలు అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సోమన్న ప్రజల మనిషి అని, ప్రజల కోసం నిరంతరం తపించే వ్యక్తి ఆ వ్యక్తి స్ఫూర్తితో నేడు రాష్ట్రంలో ప్రజలపై భారాలు వేస్తూ ప్రజల బతుకులను నాశనం చేస్తున్న రాష్ట్ర పార్టీలు వైసిపి టిడిపి జనసేన పార్టీలకు బుద్ధి చెప్పాలని అన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన మోసం చేసిన బిజెపితో అంట కాగుతూ ప్రజలను మోసం చేస్తున్న వైసిపి టిడిపి పార్టీలను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ, తాండ్రపాడు సర్పంచి బాలపీర, పంచలింగాల సర్పంచి కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు ఆంజనేయులు మాట్లాడారు. సోమన్న సతీమణి, నాగలక్ష్మి పార్టీ మండల నాయకులు రాఘవేంద్ర వెంకటేశ్వర్లు, నాగేష్ ,బీసన్న, నరసింహ. మృత్యుంజయుడు , పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే గొందిపర్ల గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ మాట్లాడారు. పార్టీ సభ్యులు పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

సోమన్న ఆశయ సాధనకు కృషి

గూడూరు : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, కోడుమూరు మాజీ డివిజన్ కార్యదర్శి సోమన్న ఆశయసాధనకోసం కృషి చేద్దామని సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్ అన్నారు. సోమన్న రెండో వర్ధంతి సభ గూడూరులోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం మండల కార్యదర్శి జె. మోహన్, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు కలిసి సోమన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జె.మోహన్ మాట్లాడుతూ కోడుమూరు డివిజన్ కార్యదర్శిగా ఉన్నప్పుడు గూడూరు, సి బెళగల్ మండలాల పరిధిలో ఉన్న సలీం శంకర్ భూముల్లో సోమన్న నాయకత్వంలో పెద్ద ఎత్తున భూ పోరాటం చేశాడన్నారు. కోడుమూరు, గూడూరు, సి. బెళగల్ కర్నూలు మండలాల్లో ప్రజా సమస్యల పైన నిత్యం ప్రజలను అంటిపెట్టుకొని పోరాటాలు చేసేవారన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ కింద

రూ.433.70 కోట్లు జమ : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇన్‌పుట్ సబ్సిడీ కింద జిల్లాలోని 3,48,106 మంది వ్యవసాయ, ఉద్యానవన రైతులకు రూ.433.70 రూ.కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను విడుదల చేశారు. కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య, నగర మేయర్ బివై.రామయ్య, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితుల వల్ల పంట దిగుబడి సరిగ్గా లేకపోవడంతో రైతుల ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. గుర్తించిన ప్రభుత్వం రైతులకు చేయూతను అందించడంతో పాటు ఇంకో పంట వేసుకోవడానికి పెట్టుబడి సహాయంగా ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు తోడుగా నిలిచిందని చెప్పారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందజేస్తున్నట్లు చెప్పారు. పంట పొలాల్లో రైతులకు అవసరమైన ఏ విధమైన సలహా, సూచనలను కూడా సచివాలయంలోని వ్యవసాయ సహాయకుల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ-క్రాప్ వివరాల ఆధారంగా పంట నష్టానికి చెందిన వివరాలను నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినట్లు చెప్పారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 2,38,230.92 హెక్టార్లలో పంట వ్యవసాయ పంట దెబ్బతినిందని, 2,90,741 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రూ.371.05 కోట్లు, ఉద్యాన పంటలకు సంబంధించి 36,855 హెక్టార్ల వివిధ రకాల పంట పొలాలు దెబ్బతినడం ద్వారా 57,365 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రూ.62.65 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి జమ చేసినట్లు తెలిపారు. ఎపిఎంఐపి పీడీ ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా మార్పు

ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల మార్పు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల స్థాయి ప్రైమరీ నుంచి సెకండరీకి, సెకండరీ నుంచి హై స్కూల్‌కు పెరగడం వల్ల పాఠశాలల పేరు మార్పు అవసరమైందని కలెక్టర్ పోలింగ్ కేంద్రాల పేరు మార్పు గురించి వివరించారు. అలాగే అవసరం మేరకు లొకేషన్ మార్పు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఏమైనా సూచనలు ఉంటే వెంటనే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రం చేరుకోవడానికి ఏవైనా ఇబ్బందు లుంటే సంబంధిత ఆర్‌ఒకు ఇవ్వాల్సిందిగా కోరారు. వీలైనంత వరకు ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఓటర్లకు దగ్గరగా ఉండే ప్రయివేట్ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫారం-7 అర్జీలు, పోలింగ్ కేంద్రాల మార్పుల ప్రతిపాదనలను రాష్ట్ర సిఇఒకు పంపాల్సిన ఉందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, బీఎస్పీ తరపున ఎ.అరుణ్ కుమార్, బిజెపి తరపున పిటి.సాయి ప్రదీప్, వైసిపి తరపున ఎస్.రాజేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ తరపున జాన్ విల్సన్, టిడిపి తరపున ఎల్‌వి.ప్రసాద్, ఎన్నికల విభాగం సూపరిండెంట్ మురళీ పాల్గొన్నారు.

తొలి మహిళ ఆటో డ్రైవర్ సిఐటియులో చేరిక

- స్వాగతించిన సిఐటియు, ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రవాణా వాహనాలను నడిపేది కేవలం పురుషులే కాదు స్త్రీలు కూడా నడపగలరని రుజువు చేస్తూ కర్నూలు జిల్లాలో తొలి మహిళ ఆటో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న న్యూ సిటీ పరిధిలోని గణేష్ నగర్‌కు చెందిన గౌతమి కొంతకాలంగా ఫైనాన్స్‌లో ఆటో కొని ఆటోను నడుపుతూ వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నది. ఇంటర్ వరకు చదివి ముగ్గురు సంతానంతో ఇప్పటిదాకా కుటుంబ పోషణ కోసం షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తూ డ్రైవింగ్ మీద మక్కువతో స్వతహాగా ఆటో నడిపి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత రెండు నెలల క్రితం ఆటో కొని నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆమె బుధవారం సిఐటియు అనుబంధ సంఘ ఆటో కార్మిక సంఘంలో చేరాలని కొత్త బస్టాండ్‌లో గల కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు సభ్యత్వం స్వీకరించారు. తొలి మహిళ డ్రైవర్‌గా ఒక మహిళ ఉండడం గర్వకారమని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ ఎండి అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.నరసింహులు. సిహెచ్ సాయి బాబా, ఆటో కార్మిక సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ ఆటో యూనియన్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకష్ణ అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలీలు గౌతమిని అభినందించారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి. నిర్మల గౌతమికి సిఐటియు కండువా వేసి సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు కార్యదర్శి పిఎస్ రాధాకష్ణ ఎండి.అంజిబాబు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి నిర్మల మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో పురుషులకు సమానంగా స్త్రీలు కూడా పనిచేస్తూ అంతర్జాతీయంగా మహిళలు గుర్తింపు పొందుతున్నారని వారన్నారు. అసమర్ధ ప్రభుత్వాల వల్ల ధరలు భారీగా పెరిగిపోవడం సామాన్యుల ఇళ్లలో భార్య భర్తలు పనులు చేస్తే తప్ప కుటుంబాలు గడవని పరిస్థితి ఏర్పడిందన్నారు. పురుషులతో సమానంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వాలు కూడా ఇలాంటి వారిని ప్రోత్సహించి రాయితీ ధరలకు ఆటోలు కొనుగోలు చేసి ఉత్సాహం గల మహిళ డ్రైవర్లకు అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళ డ్రైవర్ గౌతమి మాట్లాడుతూ సిఐటియు చేసే అనేక పోరాటాలను నేను స్వయంగా చూశానని, ఆటో డ్రైవర్లకు అండగా సిఐటియు నిలుస్తుందని సిఐటియు సంఘంలో చేరడం నాకు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. సంఘంలో చేర్పించుకున్నందుకు సిఐటియు నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఖండువా వేసి సిఐటియులోకి ఆహ్వానిస్తున్న సిఐటియు నాయకులు

దళితులకు పట్టాలిస్తారా..? చావమంటారా..?

- పురుగుమందు తాగిన ఎంఆర్‌పిఎస్ నేత రాఘవేంద్ర

- అపస్మారక స్థితిలో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి-మద్దికేర

దళితుల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని దళితులకే ఇవ్వాలని లేని పక్షంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర హెచ్చరించారు. నెల రోజులుగా రిలేనిరాహార దీక్షలు చేసినా అధికారులు స్పందించక పోవడంతో బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయ్నతం చేశారు. రాఘవేంద్ర అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఆయన చికిత్స పొందుదున్నారు. మద్దికేర గ్రామానికి చెందిన దళితులు ఎపి ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డిఓ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, అధికారపార్టీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున్న నినాదాలు చేశారు. రాఘవేంద్ర మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా దళితుల కోసం భూమి కొనగోలు చేసిందన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ఆ భూమిని అక్రమంగా పొందాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ విషయంపై దాదాపు నెలరోజులుగా రిలే నిరాహారదీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఎంతసేపటికీ అధికారులు స్పందించకపోవడంతో వెంట తెచ్చుకున్న పురుగుమందును రాఘవేంద్ర తాగారు. సహచర దళితులు వారించే ప్రయత్నం చేసేలోపే అంతలోపే పురుగు మందు తాగేశాడు. అక్కడికక్కడే నురగ కక్కుతూ కింద పడిపోయాడు. రాఘవేంద్రను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కెవిపిఎస్ సహాయ కార్యదర్శి రమేష్, ఎపి ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు యడవలి రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాఘవేంద్ర

కవి డాక్టర్ మండ్ల జయరాం అస్తమయం

సంతాపం ప్రకటించిన సాహిత్యసంఘాలు

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లా అధ్యక్షులుగా, తెలుగు ఉపాధ్యాయులుగా విశిష్టమైన సేవ చేస్తున్న కవి, రచయిత డాక్టర్ మండ్ల జయరాం బుధవారం తెల్లవారుఝామున మతిచెందారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి జడ్‌పి ఉన్నతపాఠశాలలో తెలుగు పాఠశాల సహాయకులుగా పనిచేస్తున్న ఆయన గత నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ అస్తమించారు. ఆయన భార్య అరుణకుమారి కులుమాల జెడ్‌పి ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కొడుకులు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు.

ఆయన మరణం తీరనిలోటు:సాహితీస్రవంతి

జయరాం మృతి సాహిత్యరంగానికి తీరనిలోటని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్ అన్నారు. స్వగ్రామం దేవమడలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సాహితీస్రవంతి నిర్వహించిన అనేక సభల్లో ప్రసంగించేవారని, సాహిత్యప్రస్థానం పత్రికకు వ్యాసాలు అందించారన్నారు. మృదుభాషి..సాహిత్యమంటే ఎంతో ప్రేమ కలినవాడని డాక్టర్ మండ్ల జయరాం మరణానికి సంతాపాన్ని..ఆయన కుటుంబానికి ప్రగాఢ సానూభూతిని ప్రకటిస్తున్నామన్నారు.

సహృదయుణ్ణి కోల్పోయాం: అరసం: సహదయుడైన సాహితీవేత్తను అరసం కోల్పోయిందని అరసం జిల్లా నాయకులు సయ్యద్ జహీర్ అహ్మద్ తెలిపారు. కవిగా విమర్శకుడుగా సాహిత్యలోకానికి విశిష్టసేవలందించారని ఒకప్రకటనలో పేర్కొన్నారు.

విశిష్టవ్యక్తిత్వం గల కవి: రాయలసీమ ప్రచురణలు : కవిగా, పరిశోధకుడుగా అనేక కవితలు సాహిత్యవ్యాసాలు రాసిన జయరాం విశిష్టవ్యక్తిత్వం గలవాడని రాయలసీమ ప్రచురణలు గౌరవ సంపాదకులు మారుతీ పౌరోహితం, ప్రధాన సంపాదకులు ఇనాయతుల్లా లు సంతాపప్రకటనలో వివరించారు. సాహిత్యసమాజానికి అనిర్వచనీయమైన సేవ చేశారన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు ముద్దాయిలను రిమాండ్ కు తరలించామని కర్నూలు ట్రాఫిక్ సిఐ పి.గౌతమి అన్నారు. పట్టుబడిన ముద్దాయిలను గురువారం కర్నూలు అర్బన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా వారికి రిమాండ్ విధిస్తూ ఆదేశించడంతో జిల్లా జైలుకు అప్పగించామని తెలిపారు.

మైనార్టీలు, బిసిలకు ముఖ్యమంత్రి పెద్దపీట: ఇంతియాజ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయంలో భాగంగా మైనార్టీలకు, బిసిలకు పెద్దపీట వేశారని కర్నూలు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. గురువారం ఆయన కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మేయరు బివై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి. మోహన్ రెడ్డి, వైసిపి ఆలూరు నియోజకవర్గ అబ్జర్వర్ తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, సురేంద్ర రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ జిల్లాలో స్థానికున్నే అయినప్పటికీ జిల్లాకు సేవలందించే అవకాశం ఉన్నతాధికారిగా కలెక్టర్‌గా తనకు లభించలేదని అన్నారు. ప్రజా ప్రతినిధిగా కర్నూలు నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ నుంచి తనను ముఖ్యమంత్రి ఎంపిక చేశారని అది తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కర్నూలు నగరంలో డాక్టర్ ఇస్మాయిల్ సేవలు మరువలేనివని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డాక్టర్ ఇస్మాయిల్ ల ఆశయాలమేరకు పనిచేస్తానని అన్నారు. ఇస్మాయిల్ ప్రజాసేవతో ఆయన నేటికి జీవించే ఉన్నారన్నారు. మైనార్టీలకు రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని రాజకీయ గుర్తింపును జగన్మోహన్ రెడ్డి ఇచ్చారన్నారు. ఏడుగురు ఎమ్మెల్యేలకు తన పార్టీలో అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న మాట గౌరవించి పార్టీ అభివృద్ధికి కషి చేస్తానన్నారు. నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని అన్నారు. ఇంతియాజ్ గెలుపునకు కషి చేస్తామన్నారు. మేయర్ బి వై రామయ్య మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఐఎఎస్ క్యాడర్లో రాయలసీమ స్థాయిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తొలి వ్యక్తిగా ఇంతియాజ్ నిలుస్తారన్నారు. ఆయన గెలుపుకు పార్టీ ఐకమత్యంతో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి కార్పొరేటర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఇంతియాజ్ భాష పత్రికా విలేకరులతో కలిసి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి తో అశోక్ నగర్ లోని మదీనా మసీదులో ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. 23వ వార్డులో పొదుపు మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

నిరుద్యోగులను దగా చేసిన వైసిపిని ఓడించండి

12 న జరిగే రాయలసీమ నిరుద్యోగ గర్జన

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి విడుదల చేయకుండా నిరుద్యోగులను నమ్మించి గొంతుకోశాడని పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరిత, టిడిపి నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. నిరుద్యోగులను, యువతను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని గౌరు చరిత, గౌరు వెంకట్ రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం వారి స్వగృహంలో ఈ నెల 12న కర్నూలు నగరంలో జరిగే రాయలసీమ నిరుద్యోగ గర్జన వాల్ పోస్టర్‌ను రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జెఎసి చైర్మన్ బి.శ్రీరాములు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, పాలకొలను సుధాకర్ రెడ్డి , పుసులూరు ప్రభాకర్ రెడ్డి మోహన్ రెడ్డి, నాగరాజు, అయ్యస్వామి, కోనేటి వెనకటేశ్వర్లు, రాజు, భరత్, తదితరులతో కలిసి విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో గౌరు చరిత, వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మెగా డిఎస్‌సి విడుదల చేస్తానని చెప్పి ముఖ్యమంత్రి దగా డిఎస్‌సి ఒదిలాడని అన్నారు. ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రంలో పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగ యువకుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నవ్యంధ్రప్రదేశ్‌లో యువతకు ఉపాధి లేక ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పూణే, గల్ఫ్ దేశాలకు వెళ్లి చాలి చాలని జీతాలతో దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. . అయ్యస్వామి, రవి, నవీన్, సురేంద్ర, శ్రీను పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

ప్రజాశక్తి-తుగ్గలి : మండలంలోని మీటే తండా, కడమకుంట్ల గ్రామాలలో జరిగే నిజం గెలవాలి అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు వస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు తెలిపారు. బుధవారం పార్టీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఃతిరుపాల్ నాయుడు మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు అరెస్టును భరించలేక మరణించిన మీటే తండాకు చెందిన మాజీ ఎంపిటిసి ఆర్.లక్ష్మి, కడమకుంట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త వడ్డే చిన్న రాముడులు మరణించారని, వారి కుటుంబాలన్ని పరమర్శించేందుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న టిజి.భరత్

ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి: టిజి.భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి టిజి భరత్ ప్రజలను కోరారు. నగరంలోని 3వ వార్డు బండిమెట్టలో ఆయన టిజి భరత్ భరోసా యాత్ర కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 40 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని.. ప్రజలందరూ టిడిపి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు ముందు చూపుతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చే పథకాలు రూపొందించారన్నారు. తాను ఐదేళ్లలో చేసే అభివృద్ధి 20 ఏళ్లపాటు ప్రజలకు మంచి జీవితం ఇస్తుందన్నారు. కర్నూలు ప్రజల సమస్యలు తెలుసుకొని 6 గ్యారెంటీలను తాను సిద్ధం చేశానని తెలిపారు. ప్రజలు తనకు ఓటు వేసి గెలిపిస్తే నిజమైన పాలకుడిగా సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. నగరం మొత్తం ఎన్నో సమస్యలు ఉన్నాయని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం రాగానే సమస్యలన్నీ తీర్చడంతో పాటు ప్రజల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక కార్యచరణ తయారుచేశానన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చంద్రబాబుతో మాట్లాడి పరిశ్రమలు తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నాగ వీరాంజనేయులు, ఉమామహేశ్వరి, నరేష్, కిరణ్, శ్రీనివాసులు, గౌస్, రమేష్, జికె. రమేష్, మోహన్, అక్బర్, హరి, విజయ్, మధు, నాగరాజు, నవీన్, లాల్, మా భాష, జనసేన కార్యకర్తలు శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలోకి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని సి బెళగల్ వైసిపి నాయకులు గోపాల్ గౌడ్, మల్లికార్జున గౌడ్, ఈరన్న గౌడ్, బోయ ఈరన్న, గొల్లల దొడ్డి కృష్ణ తదితరులు సుమారు 200 మంది టిడిపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో బుధవారం టిడిపిలో చేరారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిస్తేనే రాష్ట్రాబివృద్ధి సాధ్యమని పలువురు మీడియాతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసిలు వెంకట్రామి రెడ్డి,చంద్రశేఖర్, సోము గౌడ్, ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, శేఖర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

వైసిపి నాయకుని వీరంగం

- మహిళను రాడ్డుతో కొట్టడంతో తలకు గాయం
- పురుషోత్తం రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలి
- జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఓ వైసిపి నాయకుడు తప్పతాగి, ఓ దళిత మహిళ కొంగులాగి దాడి చేసి రెచ్చిపోయాడు. 'మా అమ్మను కొట్టొద్దు' అంటూ బతిమిలాడిన కొడుకులపైనా చేయి చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... నాగనాథనహళ్లి గ్రామంలో మాదిగ జయమ్మ, శివప్ప, వారి కుమారులు నరసింహులు, విజయ భార్గవ్ కలిసి ఉంటున్నారు. 2018లో స్థిరాస్తి వ్యాపారి గుండమ్మ నుంచి 1.5 సెంటు స్థలాన్ని జయమ్మ కొనుగోలు చేశారు. వీరిద్దరి నివాసాలు పక్కపక్కనే ఉన్నాయి. జయమ్మకు అమ్మిన స్థలంలో 4 అడుగుల స్థలాన్ని గుండమ్మ కబ్జా చేశారు. దీనిపై కొన్ని రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి 9 గంటల సమయంలో మరోసారి గొడవ పడ్డారు. గుండమ్మకు మద్దతుగా ఆదోని కల్లుబావికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు, రియల్ వ్యాపారి పురుషోత్తం రెడ్డి అక్కడకు వచ్చాడు. అప్పటికే పూర్తి మద్యం మత్తులో ఉన్న ఆయన.. జయమ్మను కులం పేరుతో దూషిస్తూ, ఆమె కొంగు పట్టి లాగి, పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో తలపై బాదాడు. రక్తపుమడుగులో ఉన్న భార్యను, కుమారులను శివప్ప ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పురుషోత్తంరెడ్డిపై బాధితురాలు ఫిర్యాదు చేశారని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మను జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేన మండల నాయకులు ఎం.పులిరాజు, నాయకులు శ్యామ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి నాయకుల దౌర్జన్యాలు, దాడులకు అడ్డు, అదుపులేకుండా పోతోందని విమర్శించారు. అయ్యప్ప, నరసన్న, వెంకటేష్, ఈరన్న, వీరేష్, శ్రీను, బాబు, రాము, మల్లికార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన నాయకులు

దళితుల దాడుల నివారణపై నిర్లక్ష్యం తగదు

- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికుమార్

దళితులపై దాడులు అధికమవుతున్నాయని, నివారించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికుమార్ తెలిపారు. గాయాలతో ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మాదిగ జయమ్మను బుధవారం పరామర్శించి, దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. రెండు రోజుల క్రితం పెద్దకడబూరు మండలం మేకడోన గ్రామంలో మాదిగ నరసయ్యపై అదే గ్రామానికి చెందిన ఈడిగ కులం వారు దాడి చేసిన సంఘటన మరువకముందే మళ్లీ ఈ ఘటన జరగడం బాధాకరమన్నారు. దాడికి గల కారణాలను బాధిత మహిళ వివరించారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన మాదిగ జయమ్మ మాట్లాడుతూ... ఎస్సీ కాలనీకి చెందిన గుండమ్మ అనే మహిళకు, తమకు ఇంటి స్థలం వివాదం నడుస్తోందని తెలిపారు. స్థలం విషయంలో వాదోపవాదాలు చేసుకున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఎలాంటి సంబంధమూ లేని ఆదోనికి చెందిన పురుషోత్తం రెడ్డి సోమవారం రాత్రి తనను కులం పేరుతో దూషిస్తూ అందరూ చూస్తుండగానే ఇనుపరాడ్డుతో తలపై కొట్టాడని తెలిపారు. ఈ దాడిలో తలకు బలమైన గాయమయిందని, నాలుగు కుట్లు పడ్డాయని చెప్పారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తామని రవికుమార్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం జయమ్మ ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆస్పత్రి డాక్టర్ రవికుమార్ తెలిపారు నాయకులు మధిరే అంజి, హరి, తంగరడోన నరసయ్య, మాధవరం నరసింహులు ఉన్నారు.

జయమ్మను పరామర్శిస్తున్న రవికుమార్

సూపర్ సిక్స్ పథకాలతో

పేదలకు బంగారు భవిష్యత్తు : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు బంగారు భవిష్యత్తు చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డు ఎస్సీ కాలనీలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 4వ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ తిరుగుతూ టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక అందించే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ తండ్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి హయాంలో, తన హయాంలో ఎమ్మిగనూరు పట్టణాన్ని అభివృద్ధి చెశామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో వైసిపి ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని విమర్శించారు. అభివృద్ధి కావాలంటే టిడిపి ప్రభుత్వం రావాలన్నారు. 'బటన్ నొక్కుతున్నా.. బటన్ నొక్కుతున్నా..' పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రజల పీకలు నొక్కారని విమర్శించారు. పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా, తాగడానికి నీరు కావాలన్నా, పంట పొలాలకు నీరు రావాలన్నా టిడిపి ప్రభుత్వమే రావాలని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడాలంటే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టిడిపిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రంగస్వామి గౌడ్, సుందరరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బీవీ

తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు

- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఎంపిపి జూటూరు హేమలత సూచన

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి ప్రారంభం కావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఎంపిపి జూటూరు హేమలత తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ భరేనుసాహెబ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే మండల అధికారులు మూడు నెలల్లో జరిగిన నివేదికలను చదివి వినిపించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కావాలని పలువురు సర్పంచులు ట్రాన్స్ కో ఎఇ ఉల్లిగన్న దృష్టికి తెచ్చారు. సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు చాలా ఉపయోగపడిందన్నారు. అనంతరం ఎంపిపి జూటూరు హేమలత మాట్లాడారు. ప్రజల నుంచి ఏ సమస్య వచ్చినా అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచులు పురుషోత్తం, భీమా, ఎంపిటిసిలు సుమలత, భీమ లింగ, సుంకన్న, తహశీల్దార్ పద్మజ, ఎఒ జయలక్ష్మి, ఎంఇఒలు సావిత్రమ్మ, బాలనాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, డాక్టర్ పార్వతమ్మ, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

'ఆరోగ్య సురక్ష-తో ఇంటి వద్దకే వైద్యం

- సర్పంచి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఇంటి వద్దకే వైద్య సేవలు చేరుతున్నాయని సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో దాదాపు 250 మంది బీపీ, షుగర్, డయాబెటీస్, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు రాముడు, సునీత, డాక్టర్ అతావుల్లా, హెల్త్ సూపర్‌వైజర్ వడ్డే రంగస్వామి పాల్గొన్నారు.

వైద్య చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

రేషన్ దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని 16, 17వ రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సిఐ రామకృష్ణ, అగ్రికల్చర్ విజిలెన్స్ రూపస్ మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేశామని తెలిపారు. షాపు నెంబర్ 17లో రాగులు 500 కిలోలు, చక్కెర 118 ప్యాకెట్లు, జొన్నలు 150 కిలోలు, బియ్యం 128 కిలోలు తేడా వచ్చినట్లు చెప్పారు. 16 రేషన్ దుకాణంలో రాగులు 376 కిలోలు తేడా వచ్చినట్లు తెలిపారు. దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. దేవనకొండ ఆర్ఐ వెంకటేశ్వర్లు, విఆర్‌ఒ జాకీర్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హుస్సేని, వై.రామాంజనేయులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.రుద్రముని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ముద్రించిన 'ఓట్ ఫర్ ఒపిఎస్' పుస్తకాన్ని బుధవారం మండలంలోని సంతేకుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం చేస్తామన్న వారికే తమ ఓటు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం తమ ఓటు ఏ రాజకీయ పార్టీకి వేయాలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఈరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

బీసీలకు అండగా వైసిపి ప్రభుత్వం

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

మంత్రి మండలి నుంచి గ్రామస్థాయి పదవుల వరకు బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది వైసిపి ప్రభుత్వమేనని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల మంత్రిగా ఉన్న జయరామ్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. జయరామ్ పార్టీ మారినంత మాత్రానా వైసిపికి జరిగే నష్టమేమీ లేదని తెలిపారు. జయరామ్ ఎక్కడ పోటీ చేసినా ఓడిపోవడం ఖాయమన్నారు. తమ పార్టీ కార్యకర్తలను బెదిరిస్తే సహించబోమన్నారు. జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి నాయకులు రామాంజినేయులు, జనార్ధన్ నాయుడు, మారయ్య, ఓబులేసు, గోవర్ధన్, కిషోర్, చిన్న ఈరన్న, అరికెర వీరేష్, మల్లికార్జున, శేషప్ప, షఫీవుల్లా, గంగాధర్ రెడ్డి, తపాలా శ్రీను పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. బుధవారం పట్టణంలోని 6వ వార్డు అబ్బాస్ టాకీస్ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేక దర్శించుకుని, ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ప్రతి గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తనూ కలుస్తూ పర్యటించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలకున్న సమస్యలు వింటూ, హామీలు ఇచ్చారు. తనను ఆశీర్వదించాలని, అండగా ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరులో వైసిపి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తంచేశారు. నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతూల్, 6వ వార్డు కౌన్సిలర్ శివ ప్రసాద్, కౌన్సిలర్ రాజారత్నం పాల్గొన్నారు.

మల్లెల ఆల్ఫ్రెడ్ రాజును ను కలిసిన బుట్టా రేణుక

మల్లెల గ్రూప్స్ అధినేత, వైసిపి నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజును వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆయన ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. బుట్టా రేణుకను ఆల్ఫ్రెడ్ రాజు సన్మానించి, పట్టు చీరను అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని కోరారు. పార్టీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడారు. త్వరలోనే పాస్టర్లతో పాటు ఇతర సంఘాల నాయకులు, వికలాంగులు, మహిళ సంఘాలతో పాటు ఇతర సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైసిపి గెలుపునకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, కౌన్సిలర్ నీలకంఠ, శివ ప్రసాద్, రఘు, సామ్యేల్, సతీష్ పాల్గొన్నారు.

బుట్టా రేణుకతో ఉన్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు దంపతులు

ఆసరా పేరుతో.. మహిళలకు టోకరా

- డాక్టర్ మాచాని సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆసరా పేరుతో.. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పొదుపు సంఘాలకు టోకరా పెట్టారని టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో 7, 8, 9వ వార్డుల పరిధిలో గల క్రాంతి నగర్, ఎరుకల కాలనీ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' చేపట్టారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అఖండ మెజార్టీతో గెలిచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎరుకల కాలనీలో నూతనంగా వెలసిన గద్దెరాళ్ల మారెమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీలో పరిశుద్ధాత్మ చర్చిలో పాస్టర్ యోహాషువా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాచాని సోమనాథ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సమయంలో డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, గద్దెనెక్కిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేశారని విమర్శించారు. జగన్ రెడ్డి దగా విధానంతో కేవలం 25 శాతం మందికే లబ్ధి చేకూరిందన్నారు. డ్వాక్రా మహిళల పొదుపు నిధి రూ.8700 కోట్లు మళ్లించి అభయ హస్తం రూ.2100 కోట్లు జగన్ సర్కారు స్వాహా చేసిందని విమర్శించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడానికి ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, టిడిపి నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని, ఎరుకల మారెన్న, సప్లయర్స్ బంగారప్ప, కంపాడు చిన్న రంగన్న, ఎస్.సాల్మన్, టి.ఈరన్న, జె.జైపాల్, పందికోన సురేష్, మైనార్టీ నాయకులు జబ్బార్, ఘోరా బాష, ఆఫ్గాన్ వలి బాష ఉన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సోమనాథ్

పక్కనే ఉన్నా నాట్ కవరేజ్ ఏరియా

- ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌తో వినియోగదారులకు తలనొప్పి
- వారంలో రెండు, మూడు సార్లు ఇదే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - హొళగుంద

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ తలనొప్పితో పాటు బిపి కూడా తెప్పిస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. పక్కనే ఉన్నా 'నాట్ కవరేజ్ ఏరియా' అంటూ ఇబ్బంది పెడుతోందని పేర్కొంటున్నారు. వారంలో రెండు, మూడు సార్లు ఉదయం నెట్‌వర్క్ పోతే సాయంత్రానికి కూడా సరి చేసే నాథుడే లేడని, పక్కన ఉన్నా నాట్ కవరేజ్ ఏరియా అని చెప్పడం, లేకపోతే రెండు, మూడు నిమిషాలు నిశ్శబ్దమవ్వడం, వాట్సాప్‌లో ఈ-మెయిల్ ఐడిలు ఓపెన్ కాకుండా ఉండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. బిఎస్ఎన్ఎల్, జియో, ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే ఎక్కువమంది వినియోగదారులు ప్రస్తుతం ఎయిర్టెల్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం.

సకాలంలో స్పందించని సిబ్బంది

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సంస్థ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలుగరాదని డివిజన్, జిల్లా స్థాయిల్లో సిబ్బందిని ఏర్పాటు చేసింది. నెట్‌వర్క్ ఎక్కడన్నా డౌన్ అయిన వెంటనే పునరుద్ధించేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి సిబ్బందిని ఏర్పాటు చేసుకొని నెలనెలా జీతాలు చెల్లిస్తోంది.

వినియోగదారులను పెంచుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సంస్థ వినియోగదారులను పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ వినియోగదారులకు నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో అందించడంలో లేదని వినియోగదారులు మండిపడుతున్నారు. నెలనెలా ప్రీ పెయిడ్, పోస్ట్ పెయిడ్ అని ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నా.. వినియోగదారుల సౌకర్యార్థం నెట్‌వర్క్ అందించడంలో ఎందుకు లేదని ప్రశ్నిస్తున్నారు. రెంటల్ చెల్లించడంలో ఒక్కరోజు ఆలస్యమైనా వెంటనే రీఛార్జీ చేసుకోవాలని చెబుతారని పేర్కొంటున్నారు. ఇలా వారంలో రెండు, మూడు రోజులు నెట్‌వర్క్ పోతే.. ఆ రోజులకు సంబంధించిన నెట్‌వర్క్ సంస్థ చెల్లిస్తుందా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టెలికాం శాఖాధికారులు ఎయిర్‌టెల్ సంస్థపై చర్యలు తీసుకోవాలి

వినియోగదారులను మోసం చేస్తున్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సంస్థపై ప్రభుత్వ టెలికాం శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. వినియోగదారులు చెల్లిస్తున్న రీఛార్జీ పైకానికి తగ్గట్టుగా నెట్‌వర్క్ అందించేలా చూడాలని కోరుతున్నారు.

నెట్‌వర్క్‌తో ఇబ్బంది

- వినియోగదారుడు రుద్ర గౌడ్, హొళగుంద

ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ డౌన్ కావడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం ప్రతిదీ నెట్‌వర్క్ మీద ఆధారపడి ఉంది. 10 నిమిషాలు నెట్‌వర్క్ లేకుంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ప్రతి దానికీ సెల్‌ఫోన్ మీద ఆధారపడి జీవిస్తున్నాం. మా నుంచి డబ్బులు గుంజుతారు.. డబ్బుకు తగిన నెట్‌వర్క్ అందించడంలో ఎయిర్‌టెల్ కంపెనీ వారు విఫలమయ్యారు. సిమ్‌లు కూడా బ్లాక్ అయిపోతున్నాయి. సిమ్‌ను యాక్టివేట్ చేయించుకోవడానికి ఆదోని, తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎయిర్‌టెల్ కంపెనీ వారు వినియోగదారులకు సక్రమంగా నెట్‌వర్క్ కందేలా చూడాలి.

ఫైబర్ వైర్ కట్ అయింది

- టెలిటరీ సేల్స్ మేనేజర్ అజారుద్దీన్

ఎయిర్‌టెల్ టెలిటరీ సేల్స్ మేనేజర్ అజారుద్దీన్‌ను ప్రజాశక్తి ఫోన్ ద్వారా సంప్రదించగా... 'ఫైబర్ వైర్ కట్ అయింది. వినియోగదారుల కన్నా మాకు ఎక్కువ బాధ ఉంటుంది. ఫైబర్ వైర్ అనేది భూమిలో నుంచి వచ్చి ఉంటుంది. ఎక్కడన్నా కన్‌స్ట్రక్షన్ జరిగినప్పుడు ఇలాంటి సమస్య వస్తుంది. మేమేం చేయలేం' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

సిఎం సారూ..! మాకు జీతాలు పెంచండి...

- నల్లబ్యాడ్జీలతో ఉపాధి సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

'ముఖ్యమంత్రి సారూ..! మాకు జీతాలు పెంచండి' అంటూ ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఉపాధి కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఒ నర్సప్ప, టిఎలు తిరుమల నాయుడు, కె.మల్లికార్జున మాట్లాడారు. ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర సమయంలో, అసెంబ్లీలో హామీఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి పాలనలో 2019 సంవత్సరం నుంచి ఉపాధి సిబ్బందికి ఒక్క రూపాయి కూడా జీతాలు పెంచలేదని తెలిపారు. 2019లో కరోనా సమయంలో కూడా ఉపాధి హామీ సిబ్బంది, కరోనా నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో సిసి రోడ్లు, పశువుల షెడ్లు నిర్మాణాలు తదితర పనులను ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మించారని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి మొండి చేయి చూపుతూ, జీతాలు పెంచడం లేదన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు చాలీచాలని జీతాలతో ఉపాధి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ సిబ్బంది

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- సర్పంచి ప్రహ్లాద యాదవ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సర్పంచి ప్రహ్లాద యాదవ్ తెలిపారు. బుధవారం మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 180 మంది విద్యార్థులకు సర్పంచి ప్రహ్లాద యాదవ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చేతులమీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. తాము చదివే రోజుల్లో ఇటువంటి అవకాశాలు ఉండేవి కాదని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచి ప్రహ్లాద యాదవ్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- టిడిపి మైనార్టీ యువ నాయకులు ముల్లా మోయిన్

ప్రజాశక్తి - హొళగుంద

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని టిడిపి మైనార్టీ యువ నాయకులు ముల్లా మోయిన్ కోరారు. బుధవారం సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన అయేషా సిద్ధిఖీ మదరసా విద్యార్థినులకు షీల్డ్, మెడల్‌ను ముల్లా మోయిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షీల్డ్ అందజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న షఫీవుల్లా

రూ.4 వేలు మరో శ్రీలంక కాదా..?

- వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా

ప్రజాశక్తి - హొళగుంద

బీసీ డిక్లరేషన్ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛను రూ.4 వేలు ఇస్తానని చెప్పారని, ఇలా ఇస్తే రాష్ట్రం మరో శ్రీలంక కాదా అని వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు సామ్రాట్, రాజన్న, రజక లక్ష్మన్న ప్రశ్నించారు. బుధవారం వారు హొళగుందలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని టిడిపి నాయకులు రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేశారని తెలిపారు. ఇప్పుడు పింఛను రూ.4 వేలు ఇస్తే రాష్ట్రం మరో శ్రీలంక కాదా ప్రశ్నించారు. జగన్ హయంలో మార్లమడికి రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని, రోడ్డు మరమ్మతులకు కషి చేసినందుకు జగన్‌కు, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక వివాహాలకు విరుపాక్షి విరాళం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలో శివస్వాముల ఆధ్వర్యంలో జరిగే సామూహిక వివాహాలకు వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి బుధవారం రూ.10 వేల విరాళం అందజేశారు. యువ నేత ఎస్‌కె.గిరి మాట్లాడుతూ... విరుపాక్షి సేవా కార్యక్రమాలకు ముందుంటారని, సామూహిక వివాహాలు కులాలకతీతంగా జరపడం శుభపరిణామమని తెలిపారు. కో కన్వీనర్ రవి, తిమ్మప్ప పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆలూరు

టిడిపి అధినేత చంద్రబాబును టిడిపి ఆలూరు నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, ఆయన తనయుడు గిరి మల్లేష్ గౌడ్ బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు.

చంద్రబాబుతో ఉన్న వీరభద్ర గౌడ్

రూ.16.34 కోట్ల పంట నష్టపరిహారం : ఎఒ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలానికి ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం రూ.16.34 కోట్ల పంట నష్టపరిహారం విడుదల చేసినట్లు ఎఒ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వివిధ పంటలను నష్టపోయారని తెలిపారు. సాగు చేసిన మొత్తం పంటల విస్తీర్ణంలో 9,804 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. అందుకు సంబంధించిన జాబితా ప్రకారం వివిధ పంటలకు సంభవించిన రూ.16.34 కోట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి రైతుల అకౌంట్లో జమ చేస్తారని తెలిపారు.

గ్రంథాలయ అధికారికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ... మంచి సేవలు చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఉత్తమ సేవలు చేసి ఎంపిక కావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు.

అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

అభ్యుదయ సాహిత్యానికి జయరామ్ కృషి మరువలేనిది

- అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద్

ప్రజాశక్తి - ఆదోని

అభ్యుదయ సాహిత్యానికి అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు జయరామ్ చేసిన కృషి మరువలేనిదని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున మృతి చెందిన జయరామ్ చిత్రపటానికి ఆదోనిలోని పాఠశాలలో పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సంరర్భంగా ఆయన మాట్లాడారు. జయరామ్ గత కొన్ని సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుచూ మృతి చెందారని తెలిపారు. గూడూరు గ్రామ చరిత్ర అనే పుస్తకాన్ని రచించారన్నారు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ అనేక సాహితీ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. అరసం కార్యవర్గ సభ్యులు సుధాకర్, రామయ్య, అంకి శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 7 మార్చి 2024
5
నంద్యాల





రైతులకు ఇన్పుట్ సబ్సిడీ చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

శివరాత్రికి శ్రీశైలం సిద్ధం

- మూడు క్యూలైన్ల ఏర్పాటు
- పలు ప్రాంతాల్లో చలువ పందిర్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/శ్రీశైలం

శివరాత్రికి శ్రీశైలం ఆలయం సిద్ధమైంది. భక్తుల సౌకర్యార్థం మూడు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉచితదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఉచితదర్శన క్యూలైను రథశాల నుంచి ప్రారంభమవుతుంది. రథశాల వద్ద నుంచి క్యూలైన్లలో ప్రవేశించిన ఉచిత సర్వదర్శనం భక్తులకు క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయ ప్రవేశం కల్పిస్తారు. ఈ సర్వదర్శనం భక్తులకు క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉండేందుకువీలుగా మొత్తం 17 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లను చేశారు. శీఘ్రదర్శనం క్యూలైను, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు క్యాంపు కోర్టు భవనం ముందుభాగం నుంచి ప్రారంభమవుతాయి. ఈ క్యూలైన్ల ద్వారా వచ్చే భక్తులు వేచి ఉండేందుకు క్యూకాంప్లెక్స్‌లో మొత్తం 8 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, చంటి బిడ్డ తల్లులు, దివ్యాంగులకు కూడా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. వీరిని మైక్ అనౌన్సుమెంట్ రూము ముందు భాగంలో ఉన్న దివ్యాంగుల క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. శివదీక్షను స్వీకరించిన దీక్షాభక్తులను ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్తరభాగంలో ఉన్న చంద్రవతి కల్యాణ మండపం నుంచి ఈ క్యూలైన్ ప్రారంభం అవుతుంది. శివదీక్షాభక్తులు దర్శనానికి వేచి ఉండే విధంగా చంద్రవతి కల్యాణమండపంలో మొత్తం 4 కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. పాతాళగంగ రోడ్డు మార్గంలోని శివదీక్షా శిబిరాల వద్ద జ్యోతిర్ముడి (ఇరుముడి) సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. శివదీక్షా శిబిరాలు, టోల్ గేట్ సమీపంలో ఉన్న బసవవనం, సిబ్బంది వసతి గృహాల వద్ద ఉన్న బాలగణేశ వనం, ఆలయ దక్షిణ భాగంలో ఉన్న రుద్రాక్షవనం, శివాజి గోపురం ఎదురుగా ఉన్న శివాజీ పార్కు, తెలుగు విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న రుద్రాపార్కు, మల్లమ్మకన్నీరు మొదలైన చోట్ల చలువ పందిర్లు వేసి భక్తులు సేద తీరేందుకు అవకాశం కల్పించారు. సాక్షిగణపతి, పార్కింగ్ ప్రదేశాలు, అన్నదానభవనము, కల్యాణకట్ట, చండీశ్వరసదనం మొదలైన ఆరుబయలు ప్రదేశాలలో కూడా చలువ పందిర్లు వేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం 30 లక్షల లడ్డు

భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఏర్పాటు చేసిన మూడు క్యూలైన్లు

ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. మొత్తం 15 శాశ్వత కౌంటర్ల ద్వారా లడ్డు ప్రసాదాలు అందజేస్తున్నారు. దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనం వద్ద నాలుగు తాత్కాలిక కౌంటర్లు, గణేశ సదనం ఎదురుగా రెండు తాత్కాలిక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతం, ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న ప్రదేశం, విభూతిమఠం సమీప ప్రాంతంలో, ఫిల్టర్ బెడ్, గణేశసదనం ఎడమవైపు యజ్ఞవాటిక, వాసవీవిహార్ వద్ద, ఆర్‌టిసి బస్టాండ్ వెనుక ప్రాంతం, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, గురుసదన్ ఎదురుగా ఉన్న ప్రదేశం తదితర చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. భక్తులు తాము దిగిన చోటు నుంచి ఆయా ప్రదేశాలు వెళ్ళేందుకు ఐదు బ్యాటరీ వాహనాలు, 10 ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. పాతాళగంగ వద్ద భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేశారు.పాతాళగంగ నీటిమట్టం తగ్గుతున్న కారణంగా స్నానాలఘాట్ ఎగువ భాగంలో జల్లుస్నానానికి కూడా అవకాశం కల్పించారు. పలు ప్రదేశాలలో కూడా స్నానాలు చేసేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. పాతాళగంగ మార్గంలోని కల్యాణకట్ట, రాజులసత్రం దగ్గర, ఆర్‌టిసి బస్టాండ్ వెనుక భాగంలో, శివదీక్షా శిబిరాల వద్ద దగ్గర, పాతాళగంగ మార్గంలోని డార్మెటరీల వెనుకభాగంలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర, చల్లా వెంకయ్య సత్రం ఎదురుగా సిబ్బంది వసతి గృహాల వద్ద, యజ్ఞవాటిక వద్ద వాహనాలు నిలుపు స్థలం, గణేశసదనం, వలయ రహదారిలో నక్షత్ర వనం ఎదురుగా, గంగాభవానీ స్నానఘట్టాలకు ఎదురుగా మొత్తం 12 చోట్ల స్నానాలకు ఏర్పాట్లు చేశారు.

శ్రీశైలానికి పత్యేక బస్సులు

శివరాత్రి సందర్భంగా ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 310 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. అవే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 బస్సులు, తెలంగాణ నుంచి 450 బస్సులు, కర్ణాటక నుంచి 170 బస్సులను నడుపుతున్నారు. కర్నూలు నుంచి వెంకటాపురంకు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. కర్నూలు నుంచి వెంకటాపురానికి రూ.150 వసూలు చేస్తున్నారు. ఆదోని నుంచి శ్రీశైలానికి రూ.500, ఎమ్మిగనూరు నుంచి శ్రీశైలానికి రూ.450, కర్నూలు నుంచి శ్రీశైలానికి రూ.350, నందికొట్కూరు నుంచి రూ.300, ఆత్మకూరు నుంచి రూ.250, మహానంది నుంచి రూ.350 వసూలు చేస్తున్నారు.

1619 మందితో బందోబస్తు

శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో 1619 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం నియమించారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డిఎస్‌పిలు, 37 మంది ఇన్స్‌పెక్టర్లు, 66 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, 194 మంది హెడ్‌కానిస్టేబుల్, ఎఎస్‌ఐలు, 297 మంది కానిస్టేబుళ్లు, 196 మంది హోంగార్డులను నియమించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ రూ.26.87 కోట్ల జమ

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వర్షాభావ పరిస్థితుల వల్ల 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 27,138 మంది రైతులకు రూ. 26.87 కోట్ల జమ చేశామని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రైతన్నలకు ఇన్పుట్ సబ్సిడీని రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి మోహన్ రావు తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన 6 మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల 2023 ఖరీఫ్ సీజన్‌లో దెబ్బతిన్న పంట రైతులకు ఇన్పుట్ సబ్సిడీ కింద 27,138 మంది రైతులకు రూ. 26.87 కోట్ల జమ చేసిందన్నారు. బేతంచెర్ల మండలంలో 11,999 మంది రైతులకు రూ. 11.12 కోట్లు, బనగానపల్లె మండలంలో 4888 మందికి రూ.4.89 కోట్లు, గడివేముల మండలంలో 1030 మందికి రూ.1.08 కోట్లు, మిడుతూరు మండలంలో 5605 మందికి రూ.6.1 కోట్లు, పగిడ్యాల మండలంలో 3264 మందికి రూ.3.2 కోట్లు, పాణ్యం మండలంలో 352 మందికి రూ.4.1 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్లో పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్లో ఇన్పుట్ సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, విద్యుత్తు, నీటిపారుదల రంగాలలో వినూత్న మార్పులు తీసుకొస్తూ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డేనన్నారు. వ్యవసాయ రంగానికి నీటిపారుదల పెంచాలన్న ఉద్దేశంతోనే ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఎగువ చర్లపల్లి వద్ద పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జంట టన్నెల్‌ను సిఎం ప్రారంభించి జాతికి అంకితం చేశారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రైతులకు మెగా చెక్కును పంపిణీ చేశారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- నవ దంపతులు సహా ఐదుగురు మృతి
- మృతులు హైదరాబాద్ ఆల్వాల్ వాసులుగా గుర్తింపు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఏడడుగులు వేసిన ఏడు రోజులకే ఆ దంపతులకు నూరేళ్లు నిండాయి. కాళ్ల పారాణి ఆరకముందే నూతన జంట తిరిగి రాని లోకాలకు వెళ్లి పోయింది. కోటి ఆశలతో ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకున్న నూతన జంట తిరుమలకు దర్శనార్థమై వెళ్లారు. తిరిగి స్వస్థలానికి కారులో వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొని నవ దంపతులతో సహా వరుడి తల్లిదండ్రులు, కారు డ్రైవర్ కూడా మృతి చెందారు. ఈ విషాద ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ

మృతి చెందిన రవీందర్ కుటుంసభ్యులు (ఫైల్)

సమీపంలో బుధవారం చోటు చేసుకుంది.

సంఘటన పూర్తి వివరాలు మెయిన్ పేజీలో......

స్వామి అమ్మ వార్లకు పుష్ప పల్లకి సేవ

పుష్పపల్లకిపై స్వామి అమ్మవార్ల గ్రామత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు పుష్ప పల్లకి సేవ కార్యక్రమాన్ని, గ్రామోత్సవంగా వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లోక కళ్యాణం కోసం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్క మహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథశాల వద్ద వివిధ రకాల పూలతో అలంకరించిన పుష్ప పల్లకి ఏర్పాటు చేసి అలంకార మండపం నుండి స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళ వాయద్యాలతో, వివిధ రకాల కళారూపాలతో వేద మంత్రాల మధ్య తీసుకువచ్చి ఆశీనులు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గంగాధర మండపం నుండి నంది గుడి వరకు వైభవంగా వేలాది మంది భక్తుల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులను అలరించేందుకు శివ దీక్షా శిబిరాల్లో, పుష్కరిణీ వద్ద, నిత్యకళారాదన వేదిక వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ 42 రోజుల పాటు సమ్మె చేశారని, సమ్మె కాలపు వేతనాలు ఇస్తూ జీవోను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నంద్యాల జిల్లా కమిటీ సమావేశం బుధవారం నరసింహయ్య భవనంలో డి.నిర్మలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా అంగన్వాడి సెంటర్లకు బియ్యం, పప్పు,నూనె సరఫరా చేయడం లేదని, ఏ విధంగా పిల్లలకు వంట చేసి పెట్టాలని ప్రశ్నించారు. వెంటనే సరఫరా చేయాలన్నారు. సెంటర్లకు గత రెండు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు, గత నాలుగు నెలలుగా కూరగాయ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. వైస్సార్ కిట్లు జనవరి, ఫిబ్రవరికి రాలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండలు విపరీతంగా ఉండడం వల్ల వెంటనే ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో సునీతమ్మ, నాగరాణి, రమణమ్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక

శివ భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆత్మకూరు

మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్తున్న శివ భక్తులకు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్ శెట్టి, ఏవో ఉమా శంకర్‌ల ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో పాద యాత్రికులకు చలివేంద్రం ఏర్పాటుతోపాటు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి మండుటెండలను సైతం లెక్కచేయక పాదయాత్రగా తరలివస్తున్న శివ భక్తుల దాహార్తిని తీర్చేందుకే గత రెండు రోజులుగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ తెలిపారు. ఎల్ఐసి ఆత్మకూరు బ్రాంచ్ ఉద్యోగులు ఏజెంట్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు మునయ్య, నాగన్న, ఇస్మాయిల్, లియాఖీ, ట్రెజరర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జంబులమ్మ గుడికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం జూటూరు గ్రామంలో జంబులమ్మ నూతన గుడి నిర్మాణానికి వైసిపి పాములపాడు మండల అధ్యక్షులు జి.రామలింగేశ్వర్ రెడ్డి రూ. 1 లక్ష, పాములపాడు మాజీ సర్పంచి విజయసింహారెడ్డి రూ. 10 వేలు విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారంగా విరాళాన్ని అందజేశామన్నారు గ్రామాల అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కార్యదర్శి మధుసూదన్ రావు, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, మద్దిలేటి, గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న రామ లింగేశ్వర్ రెడ్డి, విజయ సింహారెడ్డి

వైసిపి పాలనలో యువత భవిష్యత్తు అంధకారం : కోట్ల

ప్రజాశక్తి-డోన్

మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారం చేసిందని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విమర్శించారు. బుధవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో మద్రిమని అధ్యక్షతన నిర్వహించిన ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తో పాటు ఆళ్లగడ్డ టిడిపి నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఎక్కడ విడుదల చేశారో బహిరంగ చర్చకు రావాలని సిఎంకు సవాల్ విసిరారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తానని వాగ్దానం చేసి నిరుద్యోగ యువతను నిలువునా ముంచేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో నిరుద్యోగ భృతి ఇస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి అన్యాయం చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. డోన్ నియోజకవర్గ ప్రాంతంలో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు 25 లక్షల ఉద్యోగాలు కల్పించేలా చంద్రబాబు మేనిఫెస్టో ప్రకటించారన్నారు. డోన్ అసెంబ్లీ నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

శైవక్షేత్రాల్లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశాల మేరకు జిల్లాలోని శ్రీశైలం, యాగంటి, భోగేశ్వరం, ఓంకారం, మహానంది క్షేత్రాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్‌లు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 2 లక్షల 50 వేల రూపాయల విలువైన మందులు ఈ వైద్య శిబిరాలలో వినియోగించనున్నట్లు చెప్పారు. శ్రీశైలంలో ఇప్పటికే వైద్య శిబిరం ప్రారంభమైందని, మరో నాలుగు రోజుల పాటు పేచెరువు, కైలాస ద్వారం, శ్రీశైల శిఖరం వద్ద వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ బాషా, రెడ్ క్రాస్ నంద్యాల మండల నాయకులు నాగేస్వశరరెడ్డి, మహానంది, ఓంకారం, గడివేముల వైద్య శిబిరాల పర్యవేక్షకులు అమర్నాథ్, షరీఫ్, శ్రీనివాసులు, కృష్ణయ్య, డిఎఫ్ఒ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెడ్ క్రాస్ సభ్యులు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా పరిషత్ చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల సహకారం చేయాలన్నదే జగనన్న లక్ష్యమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామంలో 61 మంది జగనన్న గృహ లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో వైఎస్ఆర్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాహసిల్దార్ సునీత భాయి, ఎంపీడీవో సాయి కృష్ణ, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, తుమ్మలపెంట సర్పంచ్ మల్లేష్ రెడ్డి వెంకటలక్ష్మి రెడ్డి, బాల దస్తగిరి రెడ్డి, పెద్దిరెడ్డి, ఈడిగ వెంకటసుబ్బయ్య, హాజీ భాష, మల్లికార్జున రెడ్డి, శివశంకర్ రెడ్డి, శేషారెడ్డి, ఆదిరెడ్డి, పసులూరు నారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** మండలంలోని 8 గ్రామాల జగనన్న గృహ లబ్ధిదారులు 1631 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్‌బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి నాగమద్దమ్మ, ఎంపీడీవో శివరాం రెడ్డి, తహశీల్దార్ జమానుల్లా ఖాన్, డిప్యూటీ తహసిల్దార్ గురునాథం, వైసిపి మండల అధ్యక్షుడు వై శివరామిరెడ్డి, గడివేముల ఉప సర్పంచ్ బాల చెన్ని, మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శిరుప శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి, చిందుకూరు వెంకట కృష్ణారెడ్డి, మేఘనాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, కరిమద్దెల పుల్లయ్య, హుస్సేన్ బాష, డాలు స్వామి, సొసైటి చైర్మన్ పోగుల చంద్రశేఖర్ రెడ్డి, దేశం నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గడివేముల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న వేద పండితులు

మహానందిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మహానంది : మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, త్రిశూల పూజ, పంచగవ్యప్రాశన, ఉత్సవ సంకల్పం, ఋత్విక్వరుణ దీక్షాధారణ, మూల మూర్తులకు కంకణ ధారణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుండి వాస్తు పర్యగ్నికరణం, వాస్తుశాంతి మత్సం గ్రహణం, తీర్థపరి గ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, కలశస్థాపన, ధ్వజా రోహణం చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పన కార్యక్రమాలు వేద పండితులు నిర్వహించారు. రాత్రి మయూరవాహనంపై ఉత్సవ మూర్తులకు మాఢవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, దాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ రేంజ్ ఐజికి అహోబిలం బ్రహ్మోత్సవాల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని హైదరాబాదులోని డిజిపి కార్యాలయంలో వరంగల్ రేంజ్ ఐజి ఆవుల వెంకట రంగనాథ్, ఆయన సోదరుడు ఆవుల రంగబాబులను శెట్టి విజయ్ కుమార్ బృందం బుధవారం ఆహ్వానించారు. అహోబిల కాపు బలిజ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్, రాయల్ కాప్స్ గౌరవ సలహాదారుడు గూడూరు సంజీవ రాయుడు, రాయల్ కాప్స్ ఆంధ్ర తెలంగాణ యువ పొలిటికల్ ప్రెసిడెంట్ అంగం శివరాయల్ (జర్నలిస్ట్), రంగారెడ్డి జిల్లా ఎంకెజెఎఫ్ కన్వీనర్ గంట విజయ్ కుమార్‌లు వరంగల్ రేంజ్ ఐజిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూల బోకేలు అందజేసారు. ఐజి తప్పకుండా వస్తానని, ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారం తెలిపారు.

వరంగల్ రేంజ్ ఐజిని ఆహ్వానిస్తున్న శెట్టి విజయ్ కుమార్ వారి బృందం

ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గోస్పాడు మండలం పసరపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వికలాంగులకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి తన సొంత నిధులతో ట్రై సైకిళ్లను బుధవారం అందజేశారు. గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ భర్తలైన రెడ్డి, వైసీపీ నాయకులు ప్రసాద్ యాదవ్ సహకారంతో వికలాంగులు ఎమ్మెల్యేను ట్రై సైకిళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కొద్ది రోజుల్లోనే సొంత నిధులతో వారికి ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మార్కెట్ పరిసరాల్లో చెత్తమయంగా రహదారి

చాగలమర్రిలో పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలో గల పాత మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపం లో చెత్తాచెదారం పేరుకు పోయింది. సమీప కాలనీల్లోని చెత్తాచెదారాన్ని సచివాలయాల సమీపంలో మార్కెట్‌కు వెళ్లే రస్తాలో వేస్తున్నారు. పంచాయతీ అధికారులు చెత్తను తరలించకపోవడంతో అక్కడే కుప్పలుతెప్పలుగా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో మార్కెట్‌కు వెళ్లే ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో ఈద్గాకు కంచె ఏర్పాటు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని నమాజ్ కొండపై ఉన్న ఈద్గాకు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సొంత నిధులతో కంచె ఏర్పాటు చేయించారు. కంచె నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే బుధవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5 లక్షలు వెచ్చించి ఈద్గాకు కంచెను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ముస్లింల స్మశాన వాటికకు ప్రహరీ గోడను రూ. 22 లక్షలతో నిర్మించేందుకు భూమి పూజ చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

కంచె శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

చదవాలంటే 4 కిలోమీటర్లు సైకిల్ తొక్కాల్సిందే..

- ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకోవాలంటే ప్రతి రోజూ 3 నుండి 4 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులతో పాటు విద్యార్థినులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని ముసలమడుగు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. ముసలమడుగు గ్రామానికి ఆత్మకూరు, పెద్ద గుమ్మడాపురం, సంగమేశ్వరం వైపు ఎర్రమఠం, పాత మాడుగుల, కపిలేశ్వరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు మాత్రమే పాఠశాలలు ఉన్నాయి. మిగతా 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదవాలంటే ముసలమడుగు గ్రామానికి వెళ్లాలి. అయితే ప్రతిరోజూ విద్యార్థులు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కుతూ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అలాగే శివపురం గ్రామంలో కూడా జిల్లా పరిషత్ పాఠశాల ఉండడంతో సింగరాజుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు దారిన వెళ్తున్న ద్విచక్రవాహన దారులను ఆపుకొని ఎక్కిపోవడం, ఆపకపోతే రహదారి వెంట నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్న పరిస్థితి ఉంది. గోకవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లింగాపురం విద్యార్థులు కూడా ప్రతిరోజు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఏదేమైనప్పటికీ పాఠశాల సమయ వేళలకు విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు నడిపితే ఉపయోగ కరంగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

పాఠశాలకు సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థినులు

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

గిడ్డంగులను రైతులు ఉపయోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

రైతులు కోసం ప్రభుత్వం నిర్మించిన నూతన గిడ్డంగులను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని భానుముక్కల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల ధాన్యాన్ని గిడ్డంగులలో నిల్వ పెట్టుకోవడానికి రూ. 83.19 లక్షలతో నిర్మించిన నూతన గిడ్డంగులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుముక్కల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు సౌకర్యార్థం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సహకార సంఘంలో లాకర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, బనగానపల్లె ఎమ్మెల్యేగా తనను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల నాయకుడు అధ్యక్షులు కాటసాని తిరుపాల్ రెడ్డి, భానుముక్కల సహకార సమితి సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, సెక్రటరీ మునాఫ్, వార్డు మెంబర్ కుమ్మరి సురేష, పోలూరు కృష్ణయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

బిసిలంటే బ్యాక్ వర్డ్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

బిసిలంటే బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదని బ్యాక్ బోన్ క్లాస్ అని టిడిపి నిరూపించిందని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. జయహో బిసి డిక్లరేషన్ సభ విజయవంతం కావడంతో వైసిపి నాయకుల వెన్నులో భయం పుట్టుకుందని తెలిపారు. బిసి డిక్లరేషన్ సభలో చంద్రబాబు ప్రకటించిన హామీలతో ఆంధ్రరాష్ట్రం అంతటా బిసి సంఘాలు, బిసి సామాజిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మొత్తం 10 అంశాలతో కూడిన డిక్లరేషన్ చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూషన్న, పట్టణ అధ్యక్షుడు ఖాసీం బాబు, నాయకులు పర్లపాటి చంద్ర యాదవ్, చిన్నరాజుపాలెం నరసింహులు, వేములపాడు గుర్రప్ప, మంగంపేట శ్రీనివాసులు, జనసేన నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. **ఆత్మకూరు :** జయహో బీసీ డిక్లరేషన్ సభ విజయవంతం కావడంపై వైసీపీ నేతలకు అప్పుడే ఓటమి గుబులు పట్టుకుందని టిడిపి శ్రీశైలం అసెంబ్లీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ బీసీ డిక్లరేషన్ ద్వారా నిజమైన తల్లి ప్రేమ చూపించింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. **పాణ్యం :** బీసీల కోసం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కులాల్లో ఉత్సాహం నింపిందని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు అన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డు బిఆర్ఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలిచ్చి మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్ నగర్ కాలనీలో గుడిసె వాసులతో ఎం.కర్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుండి సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 589, 590, 595లో దాదాపు 300 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని చెప్పారు. సిపిఎం పోరాటాలతోనే కొన్ని కుటుంబాలకు మాత్రమే విద్యుత్ సౌకర్యం, మంచినీటి పైపులైను, రోడ్లు వేశారని తెలిపారు. ప్రస్తుతం నివాసముంటున్న పేదలకు పట్టాలిచ్చి కాలనీలో కనీస అవసరాలు కల్పించాలని, లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం,ప్రజా సంఘాల నాయకులు పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, బాలయ్య, ఏసేపు, ప్రసాద్, నాగ శేషమ్మ, మద్దమ్మ, త్యాగరాజు, డ్రైవర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

క్రమశిక్షణతో చదివి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని నంద్యాల డివిజన్ ఆపుస్మ అధ్యక్షులు అమీర్ భాష, విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ విజ్ఞాన భారతి హై స్కూల్‌లో బుధవారం ఫేర్వెల్ డే వేడుకలను పురస్కరించుకొని పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ అధ్యక్షతన సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉయ్యాలవాడ బిసిఎస్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ బుడ్డా విశ్వనాథరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య రాణి, ఆళ్లగడ్డ యూనిట్ కోశాధికారి సుబ్రమణ్యం, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గౌసియా తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని అంకాలమ్మ గుడి ఏరియాలో మాజీ ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణంలో ఇందిరమ్మ కాలనీ, స్వామి నగర్, పలు కాలనీలలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేవలం సొంత స్వార్థ రాజకీయాల కోసం పరితపిస్తూ, ప్రజలను బలిపశువులను చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు జగన్ రెడ్డి నవరత్నాలు అంటూ డప్పుకొట్టారని, ఎన్నికలు అయ్యాక నవరత్నాలు కాస్తా నవ మోసాలు అయ్యాయని విమర్శించారు. అసమర్థ ముఖ్యమంత్రిని ఎప్పుడు గద్దె దించి రాష్ట్రాన్ని బాగు చేసుకుందామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు అమడాల మద్దిలేటి, నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, మురళి రాజశేఖర్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పాములపాడు :** టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎస్సి సెల్ ఆర్గనైసింగ్ సెక్రెటరీ గిత్త జయసూర్య అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, మండల నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, లక్ష్మీకాంత రెడ్డి, లింగాల సర్పంచి బాల మల్లేశ్వర్ రెడ్డి, నాయకుడు స్వాములు, పూసల కృష్ణ, అబ్దుల్ ఆఫీస్, సత్యం రెడ్డి, శివరామయ్య, ఏసేపు, వివిధ గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

పాములపాడు : మాట్లాడుతున్న జయసూర్య

భిక్షాటన ముసుగులో అక్రమ మద్యం

- గోవా మద్యం బాటిళ్లను పట్టుకున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడు పట్టణంలోని చెంచు కాలనీకి చెందిన ఇద్దరు భిక్షాటన ముసుగులో గోవా నుండి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం గుర్తించారు. పట్టణం లోని చెంచు కాలనీలో భారీగా గోవా మద్యంను ఎస్సై భూపాలుడు పట్టుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ చెంచు కాలనీ గండికోట రామచంద్రుడు, సిపి నగర్ షేక్ మాబున్నిలు గ్రామంలో డబ్బులు బిక్షాటన చేస్తుంటారని తెలిపారు. వచ్చిన డబ్బులు సరిపోక ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో కొన్ని రోజుల కిందట నంద్యాల నుండి రైలు ఎక్కి గోవా వెళ్ళి అక్కడ భిక్షాటన చేసి వచ్చిన డబ్బుతో మద్యం కొనుగోలు చేసి అక్కడి నుండి రైలు మార్గం ద్వారా నంద్యాలకు, అక్కడి నుండి వెలుగోడు వచ్చేవారన్నారు. వారి వద్ద నుండి గోవా 24 ఫుల్ బాటిళ్ళు, 29 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

ఒపిఎస్ అమలు చేసే వారికే ఓటు : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేసే రాజకీయ పార్టీలకే ఓటు వేస్తారని యుటిఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం దగ్గర ముఖ్య కార్య కర్తలతో ఓట్ ఫర్ ఒపిఎస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రతి పక్ష నాయకుడు, ఇప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాత పెన్షన్ అమలు చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని అన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఒపిఎస్ అమలు చేసే విషయం ఆయా రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలలో చేర్చాలని, అలాంటి వారికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేస్తారన్నారు. కార్యక్రమంలో జాకీర్, సాయి ప్రసాద్, బొజ్జయ్య, రఘుస్వామి, లోకేంద్ర, రమణ, ప్రభాకర్, ఖలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులు

టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని గోపాల్ నగర్, కూరగాయల మార్కెట్ కాలనీలకు చెందిన 25 కుటుంబాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో బుధవారం వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వలి, కరివేపాకు సుధాకర్, మాభాష, మరియమ్మ, ఆశ, కుమారి, జహరాబి, అమీనా, రాణి, సునీతలతో పాటు 15 మందికి కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ , వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, గట్టు రమేష్, శివయ్య, పాపిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కోనేటి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు వైసీపీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న కాటసాని జయమ్మ, కాటసాని ఓబుల్ రెడ్డి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆత్మకూర్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్. వైద్యశాఖ ఆధ్వర్యంలో మహిళల చట్టాలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. నేడు చదువు ప్రాధాన్యం చాలా ఎక్కువగా ఉందన్నారు. ప్రత్యేకించి కుటుంబ సభ్యులు బాలికలకు చదువు పట్ల అవగాహన పెంచాలన్నారు. బేటి బచావో బేటి పడావో నినాదం ప్రతి ఇంటికి చేరాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి నిర్మల, సిడిపిఓ లీలావతి, డిపార్ట్మెంట్ మస్తానయ్య, స్వచ్ఛంద సంస్థ కార్యకర్త జూలి, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, సూర్య కుమారి, నాగేశ్వరి, వివిధ శాఖల మహిళా అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

మృతి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని యనకండ్ల గ్రామంలో విద్యుత్ షాక్‌తో రైతు బ్రహ్మానందరెడ్డి(50) మృతి చెందినట్లు ఎస్సై రామిరెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 5వ తేదీ సాయంత్రం పొలం వద్దకు వెళ్ళిన బ్రహ్మానంద రెడ్డి పొద్దుపోయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలిసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలం రస్తా విషయంలో దంపతులపై దాడి

ప్రజాశక్తి - బేతంచెర్ల : మండలంలోని పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన పాపసాని రామ తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి దంపతులపై పొలం రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన పాపసాని గోవిందరెడ్డి, వెంకట తిమ్మారెడ్డిలు బుధారం దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన పాపసాని రామ తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష మజ్జిగ ప్యాకెట్లు విరాళం

ప్రజాశక్తి- శ్రీశైలం : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అనంతపురంకు చెందిన గాయత్రీ మిల్క్ డైరీ ప్రైవేటు లిమిటెడ్ 1 లక్ష మజ్జిగ ప్యాకెట్లను దేవస్థానానికి విరాళంగా బుధవారం అందజేశారు. ఈ మజ్జిగ ప్యాకెట్లను కార్యనిర్వహణాధికారి పెద్దిరాజుకు దాతలు అందజేశారు. దాతలు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భక్తులకు అందజేసేందుకు మజ్జిగ ప్యాకెట్లను అందజేసినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ. 5 లక్షలు దాకా ఉంటుందని తెలిపారు.

8న మహాశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం మండలం కొండమాయపల్లి పంచాయతీ వెలగలపల్లి గ్రామ పొలిమేరలో వెలిసిన శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మహా త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి దేవస్థానంలలో ఈ నెల 8న మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదనరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేకు గన్‌మెన్‌లు తొలగింపు

ప్రజాశక్తి - అవుకు : పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన టు ప్లస్ టు అంగరక్షకులను (గన్ మెన్లను) తొలగించినట్లు పోలీస్ వర్గాల ద్వారా బుధవారం తెలిసింది. ఫ్యాక్షన్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డికి 1992 నుంచి దాదాపు 32 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వం గన్మెన్లను కేటాయించింది. 32 సంవత్సరాల పాటు నిరంతరంగా ఉన్న గన్‌మెన్‌లను నేడు ఒక్కసారిగా తొలగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిజ్జంతో పాటు మరికొంతమంది ప్రజాప్రతినిధులకు, ప్రముఖ రాజకీయ నాయకులకు కేటాయించిన గన్మెన్లను తొలగించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

9 నుండి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన

ప్రజాశక్తి - మహానంది : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానంది క్షేత్రంలో ఈ నెల 9 నుండి అఖిలభారత జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆలయ మాజీ చైర్మన్ మహేశ్వర రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.1 లక్ష 25 వేలు, రెండో బహుమతి రూ.80 వేలు, మూడో బహుమతి రూ.60 వేలు, నాలుగో బహుమతి రూ. 40 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. సబ్ జూనియర్స్ విభాగంలో రూ. 2 లక్షల 55 వేలు ప్రైజ్ మనీగా నిర్ణయించామన్నారు. న్యూ కేటగిరిలో రూ. 2 లక్షల వరకు కన్సలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ఈ రైతు సంబరాలను జయప్రదం చేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నేడు ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు శాఖపరమైన నివేదికలతో సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారని ఆయన తెలిపారు.

భార్యను చంపిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో భార్యను కత్తితో నరికి చంపిన భర్త రంగస్వామిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బనగానపల్లె రూరల్ సీఐ సుబ్బారావు, అవుకు ఎస్సై కిరణ్ బాబు సిబ్బందితో కలిసి నిందితుడు పోలక రంగస్వామిని బనగానపల్లె వెళ్లే రహదారిలో ఉన్న జమ్ములమ్మ గుడి ప్రాంతంలో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ కుతరలించినట్లు సిఐ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల : శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. అరిఫా భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అరిఫా భాను మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని చక్కగా వివరించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పురుషులు మహిళల గొప్పతనాన్ని తెలుసుకోవాలన్నారు. పిల్లలు చక్కగా మహిళల గొప్పతనాన్ని ఔనత్యాని తెలియజేస్తూ నృత్యాలు వేశారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందచేశారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మహారాజ శ్రీ కర్నూలు జిల్లా మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి: కర్నూలు

O.S.No: 419/2022

ఏం.మహేశ్వర రెడ్డి. ...వాది

-ఎదిరి-

సోమ మేఘనాథ్ గౌడు మరియు ఇతరులు. ...ప్రతివాది

2వ ప్రతివాదికి దావా సమన్లు

2వ ప్రతివాది :

బి.శ్రీనివాసరెడ్డి తండ్రి బి.శేషిరెడ్డి,
R/o H.No 1-34-10-2, రాజా వీధి,
ఆత్మకూరు గ్రామం, మండలం, నంద్యాల జిల్లా.

ఇందు మూలముగా రెండవ ప్రతివాదికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన వారి ఘనమైన కోర్టువారి ఎదుట షెడ్యులు ఆస్తి కి తానే హక్కుదారుడిని అని సదరు ఆస్తి మీద 1,2 ప్రతివాదులు ప్రవేశించ కుండా సదరు ఆస్తి పై హక్కు స్వాదీనానుభవాన్ని భంగం కలిగించ కుండా ఇంజంక్షన్ ఉత్తర్వు కొరకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. సదరు దావాలో నీకు కోర్టు వారు సమన్లు జారీ చేసిననూ నీవు ఆ సమన్లు తీసుకోలేదు. కావున ఘనమైన కోర్టు వారు ఈ పేపర్ ద్వార మీకు నోటిసులు పంపుటకు ఉత్తర్వు జరీ చేసారు. కావున 2 వ ప్రతివాది అయిన నీకు ఏవైనా అక్షేపణలు ఉన్నదో క్రింద తెలిపిన దినము ఉ. 10-00 గంటలకు కోర్టువారి ముందు హాజరై అట్టి అక్షేపణలను తెలుపుకోగలవు.

The land in Johrapuram Village under Kurnool sub-division, Kurnool Municipal corporation limits under 69 ward area in S.R.O Kurnool, and which got right from registered G.P.A Deed Doc no 69/1194 in 4th book, 74th volume, under page no 83 and 84 with following details:

Johrapuram Village
Sy/No : 107
Total Extent : Ac 0.60 cents
Schedule Extent : Ac 0.05 Cents

Boundaries:
East : land Sold to M.Krishna Chaitanya.
West : land Sold to Shaik Rabbani.
North : Kurnool Atmakur Road.
South : Kurnool Pasupala Village Road.
Total extent of Ac 0.05 Cents

వాది తరుపు న్యాయవాదులు :
డి.భాస్కర రెడ్డి,
డి.సత్య నారాయణ రెడ్డి,
కర్నూలు.

వాయిదా తేది : 20-03-2024.

మహారాజ శ్రీ కర్నూలు జిల్లా మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి: కర్నూలు

I.A.No:151/2022 IN O.S.No: 419/2022

ఏం.మహేశ్వర రెడ్డి. ...వాది/అర్జీదారు

-ఎదిరి-

సోమా మేఘనాథ్ గౌడు మరియు ఇతరులు.
...ప్రతివాది/రెస్పాండెంటు

2వ రెస్పాండెంటు కు ఆర్డర్ 39 రూల్
1& 2 C.P.C **ప్రకారం నోటీసులు**

2 వ రెస్పాండెంటు:

బి.శ్రీనివాస రెడ్డి తండ్రి బి.శేషిరెడ్డి,
R/o H.No 1-34-10-2. రాజా వీధి,
ఆత్మకూరు గ్రామం, మండలం, నంద్యాల జిల్లా,

ఇందు మూలముగా రెండవ రెస్పాండెంటుకు కి తెలియజేయడమే మనగా పైన తెలిపిన వారి ఘనమైన కోర్టు వారి ఎదుట షెడ్యులు ఆస్తి కి తానే హక్కుదారుడిని అని సదరు ఆస్తి మీద 1,2 రెస్పాండెంటు ప్రవేశించ కుండా సదరు ఆస్తి పై హక్కు స్వాదీనానుభవాన్ని భంగం కలిగించ కుండా ఇంజంక్షన్ ఉత్తర్వు కొరకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. సదరు దావాలో నీకు కోర్టు వారు సమన్లు బరీ చేసిననూ నీవు ఆ సమన్లు తీసుకోలేదు. కావున ఘనమైన కోర్టు వారు ఈ పేపర్ ద్వార మీకు నోటిసులు పంపుటకు ఉత్తర్కు జరీ చేసారు. కావున 2వ రెస్పాండెంటు అయిన నీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్నదో క్రింద తెలిపిన దినము ఉ.10-00 గంటలకు కోర్టువారి ముందు హాజరై అట్టి ఆక్షేపణలను తెలుపుకోగలవు.

The land in Johrapuram Village under Kurnool sub-division, Kurnool Municipal corporation limits under 69 ward area in S.R.O Kurnool, and which got right from registered G.P.A Deed Doc no 69/1194 in 4th book, 74th volume, under page no 83 and 84 with following details:

Johrapuram Village
Sy/No : 107
Total Extent : Ac 0.60 cents
Schedule Extent : Ac 0.05Cents

Boundaries:
East: land Sold to M.Krishna Chaitanya.
West: land Sold to Shaik Rabbani.
North: Kurnool Atmakur Road.
South: Kurnool Pasupala Village Road.
Total extent of Ac 0.05 Cents

వాది తరుపు న్యాయవాదులు :
డి.భాస్కర రెడ్డి,
డి.సత్య నారాయణ రెడ్డి,
కర్నూలు.

వాయిదా తేది : 20-03-2024.